ప్రాధాన్యత పనులు పూర్తి చేయాలి

ఓపి కి అవసరమగు పనులు వెంటనే చేయాలి

పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి, వైద్య కళాశాల పనులపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం: నాడు నేడు క్రింద ఆసుపత్రుల అభివృద్ధికి మంజూరైన పనులను వేగంగా పూర్తి చేసి సంబంధిత వైద్యులకు అప్పగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అందుబాటులో నున్న నిధులకు తగ్గట్టుగా పనులకు ప్రాధాన్యతనిచ్చి అత్యంత అవసరమైన వాటిని ముందుగా పూర్తిచేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో పి.హెచ్.సి, ఏరియా ఆసుపత్రి, వైద్య కళాశాల పనుల పై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రుల మరమ్మత్తులకు కేటాయించిన నిధులు అందుబాటులో ఉన్నాయని, లేబర్ ప్రణాళిక వేసుకొని, సిమెంట్, ఇతర సామగ్రిని ఏర్పాటు చేసుకోవలని తెలిపారు. ఓ.పి నడపడానికి వీలుగా తొలుత ఎక్విప్మెంట్, లేబ్, టాయిలెట్స్, విద్యుత్, ఆసుపత్రులకు వాహనాలు వెళ్ళుటకు అప్రోచ్ రహదారులు తప్పక ఉండాలన్నారు. వచ్చేనెలలోగా ఈ వసతులను పూర్తి చేయాలన్నారు. మరమ్మతులు, నిర్మాణాలు పూర్తయిన వాటిని వెంటనే ప్రారంభించాలని, ప్రహరి గోడలు పూర్తి కాలేదని ప్రారంభాలు పెండింగ్ ఉంచకూడదని అన్నారు. అదేవిధంగా బిల్లులను కూడా వెంటనే అప్లోడ్ చేయాలనీ అన్నారు. ఇటీవల తన పర్యటనలో భాగంగా రామభద్రాపురం పిహెచ్‌సి తనిఖీ చేయడం జరిగిందని, అయితే అక్కడ లేబర్ రూమ్ లో రన్నింగ్ టాయిలెట్ లేదని, టాయిలెట్ కు తలుపు లేదని, కనేసం లైట్ కూడా లేదని, ఇలా అయితే సర్జరీ లు జరిగేదేలా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏ ఏ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలో ఇంజనీరింగ్ అధికారులకు కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ఆర్ అండ్ బి ఎస్ ఈ, ఈ ఈ లు వారం లోగా అన్ని పనులను వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు.

కనీస అవసరాలకు ప్రాధాన్యత నిచ్చి పనులు వేగంగా జరగాలన్నారు. వెళ్ళే ముందు సంబంధిత వైద్యునికి సమాచారం ఇవ్వాలని, వైద్యునితో కలసి నిదులెంత ఉన్నది, ఆ నిధులతో ఏ ఏ పనులు చేపట్టవచ్చో చర్చించుకొని చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల పనుల పై సమీక్షిస్తూ పెయింటింగ్ వేయుటకు పెయింటర్లను సంఖ్య పెంచాలని, అదే విధంగా మేషన్స్ సంఖ్య కూడా పెంచాలని, త్వరగా ముగింపు పనులను పూర్తి చేయాలనీ ఆదేశించారు. వచ్చే సమావేశానికి అర్బన్ హెల్త్ క్లినిక్స్ పై కూడా సమీక్షించడం జరుగుతుందని, మున్సిపల్ అధికారులు కూడా హాజరు కావాలని అన్నారు. సమావేశంలో డి.సి.హెచ్.ఎస్ డా. గౌరీ శంకర్, ఎస్.ఈ ఆర్ అండ్ బి విజయరత్నం, ఈ ఈ వెంకటరమణ, ఏ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి ఈ ఈ ప్రసాద్, డి.ఈ లు, ఏ.ఈ లు హాజరైనారు.

చిరు వ్యాపారాల బడ్డీల తొలగింపు అన్యాయం : సిపిఐ

విశాలాంధ్ర-బొబ్బిలి : ఎన్నో ఏళ్ళుగా చిరు వ్యాపారం చేస్తున్న చిరువ్యాపారుల బడ్డీల తొలగింపు అన్యాయమని సీపీఐ మండిపడింది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం వద్ద గత 25 సంవత్సరాలుగా బడ్డీలు పెట్టుకొని చిరు వ్యాపారాలను సాగిస్తున్నారు. మున్సిపల్ గ్రీన్‌జోన్‌లో ఉన్న చిరు వ్యాపారులకు చెందిన సుమారు 20 మంది చెందిన బడ్డీలను తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నత అధికారులు కలెక్టర్‌కు స్థానిక టిటిడి పక్కన ఉన్న షాపులను తొలిగించాలని ఫిర్యాదులు చేయడంతో గురువారం షాపులకు చెందిన విద్యుత్తు లైనులో తొలగించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాలతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసుల సమక్షంలో బడ్డీలను జెసిబి వాహనాలతో తొలగించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్,లు మాట్లాడుతూ రోడ్డుపైన చిరు వ్యాపారాలు చేసుకుని సంబంధిత శాఖ అధికారులు తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజంగా ఈ మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే పట్టణంలో అమ్మగారి కోనేరు గట్టు మీద అనుమతులు లేకుండా పలు అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయని సీపీఐ ఆధ్వర్యంలో సంబంధిత శాఖ మున్సిపల్ శాఖ అధికారులక ఫిర్యాదులు చేసిన వాళ్ల జోలికి ఏమి పోరు..? అలాంటి కట్టడాలను ఎందుకు తొలగించరు...? వాళ్లంటే భయమా లేక తాంబూలాలు ఏమైనా అందాయా..? అని ప్రశ్నించారు. పట్టణంలో ఉన్న టిటిడి కళ్యాణ మండపం పక్కన ఉన్న షాపులను తొలగించడం అన్యాయం అన్నారు.పట్టణంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అనధికార కట్టడాల వలన జరుగుతుంది. వాటిపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారో మున్సిపల్ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఇందిరమ్మ కాలనీలో కరెంటు వైర్ల కింద పాకలు వేసుకున్న కొంతమంది నిరుపేదల పాకలను కూల్చేసిన మున్సిపల్ శాఖ అధికారులుకు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న అక్రమ కట్టడాలు కనిపించక పోవడంలో ఆంతర్యం ఏమిటి ..? ప్రభుత్వ ఆస్తులను చెరువులను దర్జాగా కబ్జా చేసి కోట్లాది రూపాయలకు పడగెత్తిన భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు ఇకనైనా కళ్ళు తెరిచి పట్టణంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను. తొలగించాలి లేనిపక్షంలో బాధితులను ఐక్యం చేసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యబలోపేతం : కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న సమూల మార్పుల వల్ల ప్రభుత్వ విద్య బలోపేతం అవుతోందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని చెప్పారు. స్వచ్ఛ విద్యాలయంలో భాగంగా ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్, ఫినిష్ సొసైటీ సంయుక్త భాగస్వామ్యంతో స్థానిక ఎంఆర్ సంస్కృత పాఠశాల ఆవరణలో నిర్మించిన టాయ్‌లెట్లను మరో డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్‌తో కలసి ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు%--%నేడుతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మారిపోయిందన్నారు. అమ్మఒడి, నాణ్యమైన పౌష్టికాహారం వంటివి అందిస్తూ పేద విద్యార్థులు చదువుకునేలా చేస్తున్నారని తెలిపారు. విద్యా, వసతిదీవెనలు పిల్లల చదువుకు భరోసా ఇస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న కృషికి స్వచ్ఛంద సంస్థల సహకారం తోడ్కైతే మరింత మార్పు సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫినిష్ సొసైటీ ప్రతినిధులు కె.సాయికృష్ణ, ఎం.వినయ్, జి.నాయుడు, గౌరీశంకర్, మంజూష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల ఆటో బోల్తా

క్షతగాత్రులను ఎమ్మెల్యే కడుబండి పరామర్శ

విశాలాంధ్ర-కొత్తవలస: మండలంలో ఉపాధి హామీ కూలీల ఆటో బోల్తాపడి 18మంది ఉపాధి కూలీలు గాయాలతో స్థానిక హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారిని స్థానిక శాసన సభ్యులు కడుబండి శ్రీనివాసరావు పరామర్శించారు. , కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో చీపురువలస గ్రామానికీ చెందిన ఉపాధి హామీ కూలీలు మింది వలస అప్పలరాజు చెరువులో పని ముగించుకుని తిరిగి వస్తుండగా వాళ్ల ప్రయాణిస్తున్న ఆటో బోల్తావడి 18 మందికి గాయాలు అయ్యాయి. అందులో

ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో విశాఖపట్నం తరలించారు. మిగలిన క్షతగాత్రులను మండల కేంద్రంలో సంజీవిని హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియగానే హుటాహుటిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించారు. డాక్టర్లతో వారి యోగక్షేమాలపై ఆరా తీసి తగిన వైద్యం తక్షణమే అందించాలని సూచించారు. ఆయనతోపాటు రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గోరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణి

విశాలాంధ్ర-తెర్లాం/ బాడంగి: ఎంపీపీ బోగి గౌరీ మాట్లాడుతూ రైతులు కి సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించి నిరంతరం రైతు శ్రేయస్సుకై రైతు భరోసా కేంద్రాలు ద్వారా సిబ్బంది సేవలు అందిస్తున్నారని రైతులు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. జడ్పీటీసీ పెద్దింటి రామారావు మాట్లాడుతూ 50%రాయితీ మీద వరి విత్తనాలు,100%రాయితీ మీద కందులు విత్తనాలు ఇచ్చి ప్రభుత్వం రైతుకి ఎల్లపుడు దన్నుగా నిలుస్తున్నాయి అని తెలిపారు. మండల వ్యవసాయా ధికారి కే. శిరీష మాట్లాడుతూ విత్తనాలు నాటే ముందు రైతులు తప్పనిసరిగా మొలక శాతం కట్టిన తరువాతనే పొలంలో చల్లుకోవాలనీ సూచించారు. కార్యక్రమం లో గ్రామ పెద్దలు తెంటు మధు , సర్పంచ్ బోగి జ్యోతి రాణి ,వైస్ సర్పంచ్ రెడ్డి కృష్ణ ,జేసీస్ కన్వీనర్ మరిపి శంకరావు, గ్రామ పెద్దలు, రైతులు, ఆర్ బీ కే సిబ్బంది దాసరి పాప, కిషోర్ పాల్గొన్నారు.

స్వర్ణపతకం సాధించిన నానికి సత్కారం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఉత్తరప్రదేశ్ నోయిడా లో ఖేల్ ఇండియా యూని వర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించిన బెల్లాన నానిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు తనయుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు శుక్రవారం ఘనంగా సత్కరించారు. నెల్లిమర్ల మండలం గరికిపేటలో జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడుతో కలిసి నానిని దుశ్శాలువతో సత్కరించారు. నాని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించి పేరు తేవాలని కోరారు. క్రీడారంగానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. ఈ సందర్భంగా బడ్డుకొండ ప్రదీప్ నాయుడు నానికి రూ.10 వేలు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, నెల్లిమర్ల నగరపంచాయతీ కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు సర్పంచులు గుంటమాని ఉమ, పతివాడ అప్పన్న, ఎంపీటీసి వాళ్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

విస్తృతంగా వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ

మంత్రి బొత్స సత్యనారాయణ

మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

చీపురుపల్లి/మెరకముడిదాం: వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ట పరిచి, దానిని విస్తృతం చేయడం ద్వారా రైతులకు మేలు కల్గించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృషి చేస్తున్నారని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామంలో కొత్తగా రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని, మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఒకవైపు వ్యవసాయ మార్కెట్ కమిటీలను పటిష్టం చేస్తూనే, మరోవైపు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతు ముంగిటకే అన్ని సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. దళారుల వ్యవస్థను నిర్మూలించి, వ్యవసాయ మార్కెట్ కమిటీలను విస్తృతం చేయడం ద్వారా రైతు కష్టానికి తగి ప్రతిఫలాన్ని అందించడం ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇటీవల కాలం లో ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ఫలితంగా రైతులు ఉద్యాన సాగు బదులు ఆహార పంటలను పండిస్తున్నారని చెప్పారు. ఏ పంట పండించినా రైతుకు తగిన గిట్టుబాటు ధరను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం గ్రామ ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, ఆర్‌డిఓ ఎం.అప్పారావు, మార్కెటింగ్ ఎడి గంగాధర్, డిఇ కోటయ్య, తాశిల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఓ రత్నం, ఏఓ శ్రావణి తేజ, ఏఈ ఆర్.పార్వతి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్లు ఎన్‌వి రమణరాజు, కెవి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, మీసాల విశ్వేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఊరికి తారురోడ్డు

రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

నియోజకవర్గంలో విస్తృత పర్యటన

విశాలాంధ్ర-గరివిడి/ గుర్ల : ప్రతీ ఊరికి తారురోడ్డును వేయడం ద్వారా, రహదారి సౌకర్యాలను మరింతమెరుగుపరుస్తున్నామని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఆయన తన నియోజకవర్గంలో శుక్రవారం విస్తృత పర్యటన చేశారు. మెరకముడిదాం మండలం కొత్తకర్ర, సిరియాలపేట, కుంచుగుమడాం, సింగవరం, గరివిడి మండలం తోంద్రంగి, దువ్వాం, చింతపల్లి పేట, శేరీపేట, గుర్ల మండలం పెనుబర్తి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బిటి రోడ్లను పరిశీలించారు. ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. పలు చోట్ల స్థానిక నాయకులతో, ప్రజలతో భేటీ అయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వారినుంచి వినతులు స్వీకరించారు. విద్యార్థులతో మాట్లాడి, విద్యాకానుక పంపిణీ, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, తన నియోజకవర్గ పరిధిలో రహదారి సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు, మొత్తం 44 బిటిరోడ్లను నిర్మించడం జరుగుతోందని చెప్పారు. వీటిలో ఇప్పటికే 9 రోడ్ల నిర్మాణం పూర్తి అయ్యిందని, మిగిలినవి త్వరలో పూర్తి అవుతాయని చెప్పారు. దశలవారీగా ఈ రహదారులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది కలగకుండా, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట అదనంగా బోర్లును తవ్వించి, త్రాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తకర్ర, కుంచుగుమడాం తదితర నాలుగు గ్రామాల ప్రజలకోసం అదనంగా మంచినీటి ట్యాంకు కట్టించి, కొత్తగా పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామని చెప్పారు. ఆగస్టులో కొత్త పింఛన్లు మంజూరవుతాయని తెలిపారు. లోఓల్టేజీ, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పర్యటనలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఆర్‌డిఓ ఎం.అప్పారావు, పంచాయితీరాజ్ ఎస్ఈ గుప్త, ఆయా మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసిలు, తాశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్టు పంపిణీ

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని సింగవరం రైతు భరోసా కేంద్రం లో శుక్రవారం నార్త్ కోస్టర్ రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్ నార్త్ కోస్టల్ రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమ సుందర్ ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు అనంతరం నవధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు నవధాన్యాలు వల్ల నేల తల్లి బాగు అనే కార్యక్రమంలో భాగంగా ఈ నవధాన్యాలను భూమిలో సాగు చేయటం వల్ల భూమిలో జీవవైవిద్యము మరియు కార్బన్ శాతము తేమ పెరిగి భూసారం పెరుగుతుందని వానపాములు వృద్ధి చెందుతాయని తద్వారా అధిక దిగుబడును సాధించవచ్చు అని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకోటి గురుమూర్తి రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రతీ విద్యార్థీ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగిన నాడే ఆ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకోగలరని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్.కె. కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఎంసెట్ పోటీ పరీక్షలో ఉత్తమ ర్యాంకుల సాధించిన విద్యార్థిని విద్యార్థులను, వారి తల్లీ దండ్రులను అభినందించే కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పూడి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిజంగా ఈ రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణలా వారి జీవితాంతం నిలుస్తుందని ఎందుకంటే ఉత్త ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించినప్పుడు వారి భవిష్యత్ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి ఉన్నత ఆశయంతో ముందుకు సాగుతారు కాబట్టి వారు వేసే ప్రతి అడుగులోనూ ఇప్పుడు ఇచ్చే ఈ ప్రేరణ అనేది ఎప్పటికీ గుర్తుకు తెస్తూనే ఉంటుందన్నారు. ముఖ్యంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు గురించి చెప్పాలంటే ఒక సాధారణమైనటువంటు విద్యార్థులను అసాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్ది ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా వారిని ప్రోత్సహించి ఉన్నత స్థానాలను అధిరోహించడానికి వారిని కార్య దీక్షకులుగా చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు.ఏ కార్యక్రమంలో వైసీపీ నాయకులు,కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుమడాం గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి



విశాలాంధ్ర-సాలూరు టౌన్: గుమడాం గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ఆదేశించారు. సాలూరు పురపాలక సంఘం పరిధి గుమడాం లే అవుట్ ను శుక్రవారం ప్రాజెక్టు అధికారి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహనిర్మాణాలు నిర్దేశిత సమయంలో పూర్తికావాలని ఆయన స్పష్టం చేశారు. త్వరలో వర్షాలు ప్రారంభం అవుతుందని, పనులకు ఆటంకం కలుగుతుందని కావున సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. లబ్దిదారులకు ఎప్పటికప్పుడు ప్రేరణ కల్పించాలని తొందరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని వారికి చెప్పాలని ఆయన ఆదేశించారు. అనంతరం సాలూరు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులు తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి నిర్దేశిత కంపోనెంట్స్ విధిగాఉండాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో అజాగ్రత్త వహిస్తే వారిపై చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ హెచ్. శంకర రావు, సాలూరు ఎంఈఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే కళావతి

విశాలాంధ్ర-పాలకొండ: యువత చక్కగా చదువుకొని అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం హెచ్ఎం సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో విద్యకోసం అనేకమైన సంస్కరణలు తీసుకు వచ్చారని, నేడు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉపాధ్యాయులు చక్కగా నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. భాను, వైస్ చైర్మన్ హనుమంతురావు, వైసీపీ పట్టణాధ్యక్షులు వి. మన్మథరావు, నాలుగవ వార్డు కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు, ఉప మండల అధ్యక్షులు వాకముడి అనిల్‌కుమార్, మూడో వార్డు కౌన్సిలర్ నీలాపు శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు యువకునిపై దాడి



విశాలాంధ్ర-బెలగాం: బాకీ డబ్బులు అడిగినందుకు యువకునిపై దాడి చేసి కొట్టడంతో గాయాలయ్యాయి. పార్వతీపురం పట్టణం చినదేవరవీదికి చెందిన పాచిపెంట సంతోష్ ఉరఫ్ సంతు అనా రోగ్య కారణం మతిసరిగ్గా పనిచేయక పోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. గతంలో బి.సంతోష్ అనే ఆర్టీసీ హెల్పర్‌కు వేయి రూపాయలు ఇచ్చాడు. గురువారం రాత్రి పాత బస్టాండ్ వద్ద ఉండగా ఇంతలో ఆర్టీసీ హెల్పర్ సంతోష్ అక్కడికి రాగా తన డబ్బులు అడగగా, అప్పలనాయుడు. జాగాన రామా అనే ఇద్దరు కలిసి సంతోష్‌ను కొట్టారు. దీంతో సంతోష్ అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం తన తల్లి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర-కురుపాం: గిరిజనులకు ఇళ్లస్థలాలు ఇప్పించి ఆదుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది, సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్నల ఆధ్వర్యంలో ఇళ్ళ స్థలాలకై భూ ఆక్రమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇళ్లులు లేనివారు అనేక మంది ఉన్నారన్నారు, మండలంలో పెదఖర్జ, తోలుఖర్జ, మంగళాపురం, బొడ్డిడి తదితర గ్రామాల్లో భవననిర్మాణ పనులకోసం అద్దె ఇంట్లో అద్దెలకు ఉంటూ పిల్లలతో నానా బాధలు పడుతున్న రన్నారు. గిరిజనులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అధికారులను ఎన్ని సార్లు కలిసినా ఫలితం శూన్యం అయిన సందర్భంలోనే ఇళ్ళ స్థలాలు కోసం గుమ్మలక్షిమీపురం లో ప్రభుత్వ అటవీ భూమిలో ఉందామని ఈ గ్రామాల గిరిజనులందరూ డొంక పుట్టా నరికి సదును చేస్తున్న సమయంలో పోలీసులు వచ్చి అరెస్టులు చేయడమైనది,, సుమారు 200మందిని అరెస్టు చేసి తర్వాత వదిలివేయడమైనది, ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్ మోహనరావు గోపాలం కమ్యూనిస్టు పార్టీ న్యూడెమోక్రసీ, ఆదియ్య, గిరిజన జేఏసీ రామ్మూర్తి, గిరిజనులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలను సత్కరించిన మరిపివలస ఉన్నతపాఠశాల సిబ్బంది

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు ద్వారా 10వతరగతిలో మొదటి, రెండవ,మూడవ రాంక్ లు సాధించిన గలావిల్లి భారతి, చిట్టపల్లి శ్రావణి,పెంకి స్రవంతిలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరమణ, పాఠశాల ఇంఛార్జి హెచ్ఎం జి.శ్రీనివాసరావు,జిల్లా పి.ఆర్.టి.యూ అధ్యక్షులు వి.తవిటినాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్ ను అభినందించిన సీఎం

విశాలాంధ్ర-పార్వతీపురం: కృష్ణాజిల్లా గుడివాడ పరిధిలో 77 ఏకరాల్లో 799.19 కోట్లతో పండుగ వాతావరణంలో 8912 టిడ్కో సామూహిక గృహప్రవేశాలు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేతులమీదుగా టిడ్కోఇళ్ళు,పట్టాల పంపిణీ కార్యక్రమం ను శుక్రవారం ఘనంగ జరిగినట్లు రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రముఖ్యమంత్రికి టిడ్కో తరుపున ముందుగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువాతోసత్కరించారు. ఈసందర్భంగా సీఎం జగన్ టిడ్కో ఛైర్మన్ జమ్మాన కృషినికొనియాడి, భుజంతట్టి ప్రత్యేక అభినందనలు తెలిపారని జమ్మాన విలేకరులకు తెలిపారు.

జిల్లాలో 24న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం



విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలో ఈనెల 24న ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలోజగనన్న సురక్ష కార్యక్రమంఅమలపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమీషనర్లకు శిక్షణాకార్యక్రమంను నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 24 నుండి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. గ్రామంలో పర్యటించే మండలటీం ద్వారా సదరుసమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధృవపత్రాలు, జనన, మరణ ధృవపత్రాలు, ఫ్యామిటీ మెంబరు సర్టిఫికెట్స్, వివాహ సర్టిఫికెట్స్, మ్యుటేషన్లు తదితర సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్స్ జారీ, మ్యుటేషన్లు చేయునపుడు నిబంధనలు పాటించాలని తెలిపారు.మండలస్థాయి, గ్రామస్థాయిలో సచివాలయంసిబ్బంది, ప్రతి మండలానికి రెండు మండల టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఒకటీంలో తహశీల్దారు, ఈఓపిఆర్డీ సిబ్బంది ఉంటారని, మరొకటీంలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దారు సిబ్బంది ఉంటారని, పట్టణ పరిధిలో మున్సిపల్ కమీషనరు, డిప్యూటీ తహశీల్దారు, సిబ్బంది ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, సబ్ కలెక్టరు నూరుల్ కమర్, జిల్లారెవిన్యూఅధికారి వెంకట రావు, ఆర్.డి.ఒ. కె.హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, తహశీల్దార్లు, ఎం.పి.డి.ఒ.లు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

ఓటరు జాబితా పక్కాగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఓటరుజాబితా అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఓటరు నమోదు అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుజాబితాలు ఆరోపణలకు తావుఉండరాదన్నారు. ప్రతీ విషయాన్ని పక్కాగా పరిశీలించి ఆరోగ్యవంతమైన జాబితాను తయారు చేయాలని సూచించారు.

నిరుద్యోగ యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం/పార్వతీపురం టౌన్: నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కురుపాం శాసనసభ్యులు పాముల పుష్ప శ్రీవాణి అన్నారు.శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా కురుపాం నియోజకవర్గం సంబంధించి స్థానిక గవ్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణంలో మెగాజాబ్ మేళాను ఆమె ప్రారం భించారు. ఈ జాబ్ మేళా కి 10 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 286 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 69 మంది వివిధ కంపనీలో ఎంపిక కావడం జరిగింది . ఈ యొక్క జాబ్ మేళ కార్యక్రమం లో కురుపాం నియోజికవర్గం శాసన సభ్యురాలు శ్రీమతి. పాముల పుష్పశ్రీ వాణి ,జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి ఆదేశాలు అనుగుణంగా మన నియోజకవర్గం లో ఉద్యోగ మేళా నిర్వహించటం చాలా సంతోషకరంగా ఉంది. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశం అందిపుచ్చు కోవాలన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ హరికృష్ణ నైపుణ్య అభివృద్ధి సంస్థ సిబ్బంది హాజరయ్యారు. కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ. హరికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటిసారి ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని మరియు ఇలాంటి అవకాశాలని నిరుద్యోగా యువత అందిపుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అదిరోహించాలన్నారు.

గిరిజన సంక్షేమ డీడీగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సీతంపేట: ఐటీడీఏ గిరిజన సంక్షేమ డీడీగా మందస ఏటీడబ్ల్యూవో ఎం.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం దానికి సంబంధించిన ఉత్తర్వులను పీవో అందజేశారు. గిరిజన సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలని ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేసే విధంగా పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం అందిస్తున్న అన్ని విద్య పథకాలు విద్యార్థులకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. బాధ్యతగా పని చేయాలని అన్నారు. డీడీ నగేష్ మెడికల్ సెలవులో ఉన్నందున ఈయనకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఐటిడిఎ పీవో తెలిపారు.

జిల్లాలో ఐదుసంసద్ ఆదర్శగ్రామాలుగా దత్తత : ఎంపీ మాధవి

విశాలాంధ్ర- పార్వతీపురం: సంసద్ ఆదర్శ గ్రామయోజన కార్యక్రమంక్రింద పార్వతీపురం మన్యంజిల్లాలో నర్సిపురం (పార్వతీపురం మండలం), నీలకంఠాపురం (కురు పాం), కన్నపుదొరవలస (జియ్యమ్మవలస), ఇసుకగెడ్డ (సీతంపేట), పాచిపెంట (పాచిపెంట) ఐదుగ్రామాలను దత్తత గ్రామాలుగా తీసుకోవడం జరిగిందని, వాటిని అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అరకు పార్లమెంటు ఎం.పి గొడ్డేటి మాధవి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధ్యక్షతన సంసద్ ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపి మాధవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆమె చెప్పారు. గ్రామాల్లో అందరు విద్యార్థులు బడిలోఉండటం, యువతకు మంచి అవకాశాలు కల్పించడం తదితర కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలపై నిశిత దృష్టి సారించింది పథకాలు వినియోగించుకోవడం ద్వారా లక్ష్యాలు సాధించగలమని అన్నారు. మంచి సంకల్పం ఉంటే గ్రామ అభివృద్ధి వస్తుందని అన్నారు. జూన్ 25 నాటికి గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని ఆయన ఆదేశించారు.

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మరియు నోడల్ అధికారి డా.ఎం. అశోక్ కుమార్ కార్యక్రమం వివరాలు తెలిపారు. గ్రామాల్లో వ్యక్తిగత ప్రవర్తన - పరిశుభ్రత పాటించడం, మద్యపానం, ధూమ పానం నిషేదం, ఆరోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టడం., మానవ అభివృద్ధి - విద్యా, వైద్యం, పౌష్టిక ఆహారం పొందడం., ఆర్థిక, పర్యావరణ, సామాజిక అభివృద్ధి., సుపరిపాలన, ప్రాథమిక సౌకర్యాలు, సేవలు కల్పన రంగాల్లో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. దరణయి (బీహార్), పేవిహిర్, బాఘువర్ (మధ్య ప్రదేశ్), హైవరే బజార్ (మహారాష్ట్ర), ఓడంతురై (తమిళనాడు), ఖోనోమ, చిజమి (నాగాలాండ్), గంగదేవిపల్లి (ఆంధ్ర ప్రదేశ్), కొక్రెబెల్లూర్ (కర్ణాటక), పున్సారి (గుజరాత్), రామచంద్రపూర్ (తెలంగాణ), మేలున్నింగ్ (మేఘాలయ), పిప్లంత్రి (రాజస్థాన్), ఎరవిపెరూర్ (కేరళ), శికద్మాఖ (అస్సాం) వివిధ అంశాలలో దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఆయన తెలిపారు.

జిల్లాల్లోని గుర్తించిన ఐదు సంసద్ ఆదర్శ గ్రామాలకు చార్జి అధికారులుగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు (నర్సిపురం), జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ (నీలకంఠాపురం), జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్ (కన్నపుదొరవలస) జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు (ఇసుకగెడ్డ), జిల్లా పరిషత్ డెప్యూటీ సి.ఇ.ఓ (పాచిపెంట) ను నియమించారు. ఈసమావేశంలో జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి.ప్రసూన, జిల్లా వ్యవసాయఅధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖఅధికారి డా. బగాది జగన్నాథరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయగౌరి, సంబంధిత సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలి

ఉసిరి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం రాత్రి పిలుపునిచ్చారు. శృంగవరపుకోట మండలం, ఉసిరి గ్రామంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన వరాలు పార్టీ విజయానికి సోపానాలుగా భావించి ప్రజలకు వివరించాలని హితవు పలికారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తయారుచేసిన మేనిఫెస్టోను కార్యకర్తలు ప్రతి ఒక్క ఓటరుకి వివరించి పార్టీ వైపు మళ్ళించాలని సూచించారు. ఈ మేరకు మహానాడు వేదికగా మహిళలకు మహాశక్తిలో భాగంగా మేనిఫెస్టోలో 18సం. నుండి 59సం. లోపున్న ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అందరికీ నెలకు రూ.1,500/- చొప్పున ఇస్తామనడం, జిల్లాలోని ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించడం, ఒక ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామనడం, ప్రతీ యేటా తల్లికి వందనంలో భాగంగా ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ ఏటా రూ.15,000/- చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇవ్వడం, ప్రతీ రైతుకు ప్రతి ఏటా రూ.20,000/- ఇవ్వడం, చదువుకున్న నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3,000/- అందించడం రాష్ట్ర ప్రజలకు చాలా మేలు కలుగుతుందన్నారు. ప్రజలు ఆలోచించి 2024లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని లలితకుమారి కోరారు. టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టాలన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఉసిరి టీడీపీ నాయకులు గొల్లు వెంకటరమణ, గొల్లు అప్పారావు, రాయవరపు వాసు, గులిపల్లి అప్పలనాయుడు, వర్రి రామునాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు, రైతులు, యువత పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: బిందు తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎన్వి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఆకులకట్ట, గొల్లాది గ్రామాల్లోని చప్ప సూర్యనారాయణ, కేతిరెడ్డి అప్పలనాయుడు, బెవర పార్వతికి అందించిన బిందు, తుంపర సేద్య యూనిట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు బిందు తుంపర్ల సుక్ష్మసేద్య విధానంలు లాభదాయకమని తెలిపారు. ఎరువుల యాజమాన్యంలో మెళుకువలు పాటించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించవచ్చు అన్నారు. మండలంలోని 37 మంది రైతులకు రూ 19,34,792 విలువైన సూక్ష్మ సేద్య యూనిట్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఏ.ఏ సతీష్, ఎం.ఐ.ఏ.ఓ శంకర్, కంపెనీ డీసీఓ సీర రాజేష్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం ప్రారంభం

చీపురుపల్లి/మెరకముడిదాం: చీపురుపల్లి నియోజక వర్గం మెరకముడిదాం మండలం బైరిపురం గ్రామం పరిధిలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని ప్రారంభోత్సవం చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అనంతరం చీపురుపల్లి నియోజకవర్గంలో మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాలలో వివిధ గ్రామాలకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్లను పర్యవేక్షించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మెరకముడిదాం ఎంపీపీ శ్రీమతి తాడ్డి కృష్ణవేణి తాడి వేణు, జెడ్పీటీసీ వెంకటరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్ వి రమణరాజు (పెద్దబాబు) గుర్ల మండల నాయకులు పలాస నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు కే వి సూర్యనారాయణ రాజు(పులి రాజు) జడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, గరివిడి మండల నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు ప్రజా ప్రతినిధులు వివిధ హోదాల్లో ఉన్న అధికారులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర- పార్వతీపురం: మొదటివిడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషను పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయం నుండి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమీక్షా సమావేశంలో రీసర్వే, ఎన్.సి.డి. సర్వే, రిజిస్ట్రేషన్లు, ఇ-క్రాప్ బుకింగు, విత్తనాలు పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రీసర్వే పనులను పూర్తిచేయుటకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసిందని, దాని ప్రకారం అక్టోబరునెల నాటికి పనులను పూర్తిచేయాలని తెలిపారు. మొదటి విడత పూర్తయిన గ్రామాలలో ఈనెల 25నుండి రిజిస్ట్రేషన్లు చేయుటకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్సిడి. సర్వే త్వరగా పూర్తిచేయాలని, సర్వే ఎంతవరకు జరిగింది. నివేదిక అందజేయాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ జూలై 1నుండి ఇ-క్రాప్ బుకింగు మొదలు పెట్టాలని, సెప్టెంబరు 1 నాటికి పూర్తిచేయాలని తెలిపారు. రాగి, కందులు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ పూర్తి చేయాలని, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన గింజదాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లారెవిన్యూ అధికారి జె. వెంకటరావు,జిల్లావైద్య ఆరోగ్య శాఖాదికారి బి.జగన్నాధరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్యా యత్నం

విశాలాంధ్ర-బెలగాం: తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణం రెల్లివీదికి చెందిన సిరిపురపు ఆశ చదువు మానివేసి ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం ఇంటి వద్ద పడుకొని వుండగా తన తల్లి సుజాత వచ్చి నిద్రలే చాలా టైమయింది లేచి పని చెయ్యని చెప్పగా దానితో ఆశ ఎందుకు తెల్లవారింటికి పని చెయ్యమంటావు అని అడిగింది. దానితో తన తల్లి ఇంకా తిట్టడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఉన్న చీమలమందు గ్లాసులో కలుపుకొని త్రాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన ఆమె తల్లి కేకలు వేయగా చుట్టుప్రక్కల వాళ్లు వచ్చి కక్కించారు. తరువాత పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొనిరాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గడసాంలో జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర-దత్తిరాజేరు: మండలంలో గల గడసాం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు అల్లు. వెంకటరమణ ఆధ్వర్యంలో ఇటీవల 10వ తరగతిలో పాసైన అత్యధిక మార్కులు వచ్చిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ బహుమతులు సర్పంచ్ నేతటి దీపిక చేతుల మీదగా మొదటి బహుమతి సింగారపు యమున 3000 రూపాయలు, రెండవ బహుమతి,2000 రూపాయలు, మూడవ బహుమతి 1000 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ నేతేటి వెంకటరమణ, బూడి గణపతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం కరెంట్ బిల్లులతో జనానికి షాక్

-విద్యుత్ చార్జీల పెంపును గత విద్యుత్ ఉద్యమస్ఫూర్తితో ప్రతిఘటించాలని సిపిఎం పిలుపు

- జూన్ 18న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రం విడుదల

విశాలాంధ్ర-బెలగాం : స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ పోస్టర్ విడుదల చేసిన సందర్భంగా సిపిఎం పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు ఇంతవరకు రెండేళ్లకో మూడేళ్లకో కరెంటు చార్జీలు పెంచేవారని మోడీ ప్రభుత్వం ఆదేశాలతో లొంగిపోయిన జగన్ ప్రతినెల వంటగ్యాస్ లాగే కరెంటు చార్జీలు పెంచడానికి ఆదేశాలు ఇచ్చారని, కరెంటు బిల్లు కాకుండా ఫిక్స్ చార్జీలు కస్టమర్ చార్జీలు సర్ చార్జీలు విద్యుత్ సుంకం గతంలో కాల్చిన విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేర్లు పెట్టి జగన్ ప్రభుత్వం విద్యుత్ సంస్థ జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని, అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయన్నారు. ఈ నెల నుండి అన్ని బిల్లుల్లో 10% నుండి 50% వరకు సర్దుబాటు చార్జీలు భారం పడిందని, జగన్ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతిఘటించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ప్రజానీకాన్ని కోరుతుందన్నారు. ఈ విషయంపై చర్చించడానికి ఈనెల18వ తేదీన అన్ని సంఘాలు వామపక్షాలతో పార్వతీపురం సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని దీనిలో అందరూ పాల్గొనవలసినదిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. రామస్వామి, గొర్లి వెంకటరమణ, రెడ్డి లక్ష్మునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఇందిర పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి.శ్రీకాంత్ అన్నారు.నియోజకవర్గంలోని, బలిజిపేట మండలంలో 71 వ సచివాలయం పరిధిలో 242వ రోజున గళావల్లి సచివాలయం, గేదెలపేట, గలావల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం నాలుగేళ్ల పరిపాలనా కాలంలో అందించిన సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని, సంక్షేమ అభివృద్ధి పాలనకు ప్రజలందరి తోడ్పాటును ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం, మండల పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, స్థానిక సర్పంచ్ మామిడి చంద్ర చూడామని, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులకు సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, మండల వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు ఎంపిడిఓ, ఏపీవో, ఏపీఎం, ఎలక్ట్రికల్ ఏఈ, హౌసింగ్ ఏఈ, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని సి కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంను నిర్వహించనున్నట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్లకి ప్రతిభా అవార్డులను ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసన సభ్యులు అలజంగి జోగా రావు ముఖ్య అతిథిలుగా హాజరగుతారని,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొంటారని తెలిపారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలంలో వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీలను తే 16.06.2023 ది ఉదయం గం.10.00 లకు పి.వి.జి. లక్ష్మి, తనిఖీదారు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, విజయనగరం వారి సమక్షంలో దేవాలయం వద్ద తెరచి లెక్కించగా తే 27.03.2023 ది నుండి 16.06.2023 ది వరకు రూ.3,80,445.00 వచ్చినది. కార్యక్రమంలో ఇప్పిలి సూర్యప్రకాష్ (చైర్మన్) సూరు వెంకట కుమారస్వామి (వైస్ చైర్మన్) వంకల కృష్ణ, రేగిడి అప్పలనాయుడు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలు మానుకోవాలి

గోపాలపల్లి టీడీపీ సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు ఆవేదన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: వైసీపీ ప్రభంజనంలో కూడా గోపాలపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేశాం. ఇటువంటి సమయంలో తమను ప్రోత్సహించాల్సిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి మరో వర్గం తయారు చేయడం బాధాకరమని సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాము తెలుగుదేశం పార్టీకి చెందిన నేతతో తిరుగుతుంటే తమ గ్రామంలోకి వచ్చినప్పుడు కనీసం తమకు సమాచారం ఇవ్వకుండా ఏదో పనిపై వస్తున్నట్లు చెప్పి గ్రామంలో టీడీపీ సమావేశం ఏర్పాటు చేయడం బాధ కలిగించిందన్నారు. తమతో పార్టీకి కలిసి పనిచేసిన వ్యక్తిని వేరే వర్గంగా తయారుచేసి తమపైనే ప్రయోగించడం ఏంటని, ఇలా చేస్తే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఏమైనా ఉంటే సూటిగా ప్రశ్నించాలి, అడగాలి తప్పా తాము ఊర్లో లేని సమయంలో ఎవరికీ తెలియకుండా ఒక మేడపై చీకట్లో సమావేశం పెట్టి వెళ్లిపోవడం ఏంటన్నారు. గ్రామంలో తెలుగుదేశం కలిసికట్టుగా ఉందని, వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎమ్మెల్యే అభ్యర్థి అయినా వారి విజయం కోసం పనిచేస్తాం తప్ప తాము వేరే పార్టీకి పనిచేయమని.. సైకిల్ గుర్తుకే పని చేస్తామని స్పష్టం చేశారు. మాకు మాజీ ఎమ్మెల్యేతో ఎటువంటి విభేదాలు లేవని వెల్లడించారు. అయినా ఆమె టీడీపీకి చెందిన వ్యక్తి వద్దనే తాము ఉండడం చూసి ఇటువంటి ప్రయత్నాలు చేయడం సబబు కాదని హితవు పలికారు. టీడీపీ బలంగా ఉన్న గోపాలపల్లి గ్రామంలో గ్రూపులు పెట్టడం మానాలని గ్రామ సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

నేడు జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని సి కన్వెన్షన్ హల్ లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపల్ కు ప్రతిభా అవార్డ్ లను ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యులు అలజంగి.జోగారావు, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొంటారని తెలిపారు.

విద్యావ్యాప్తికి స్నేహ స్వచ్ఛంద సంస్థ కృషి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విద్యా వ్యాప్తికి స్నేహ స్వచ్ఛంద సంస్థ విశేష కృషిచేస్తోందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అట్లూరి శ్రీవెంకట రావు, మంథా సుబ్బారావు వెల్లడించారు. శృంగవరపుకోట స్నేహ స్వచ్ఛంద సంస్థ మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పదవ తరగతి పరీక్షల్లో మండలంలోనే 569 అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని మిదతాన లిఖితకు హెచ్ఎం సుబ్బవరపు వెంకటరావు, ఉపాధ్యాయులు, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మధ్య నగదు పారితోషకంతో పాటు మెమెంటోను స్నేహ సంస్థ సభ్యులు శుక్రవారం అందజేశారు. విద్యార్థిని లిఖితను సంస్థ అధ్యక్షులు అట్లూరి శ్రీవెంకట రావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, సభ్యులు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, వద్దిరాజు రాము తదితరులు సన్మానించారు. అనంతరం లిఖిత తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్నేహ సంస్థ అధ్యక్షులు వెంకటరావు మాట్లాడుతూ స్నేహ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారికి అండగా ఉంటుందని, వచ్చే సంవత్సరం కూడా మండలంలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ప్రతి ఒక్క విద్యార్థిని ఇదేవిధంగా ప్రోత్సహిస్తామని స్పష్టంచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావు మాట్లాడు తూ విద్యతో పాటు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న స్నేహ సంస్థ వారికి, విద్యార్థుల వెన్నంటే ఉండి వారి ఉన్నతికి పాటుపడుతూ చదివించిన తల్లిదండ్రులకు, ఇన్ని మార్కులు రావడానికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ లిఖిత చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా జిల్లా స్థాయిలో చెస్ ఛాంపియన్ గా నిలిచి ఎంతోమంది కళాకారులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

కృష్ణరాయపురంలో కాలువల్లో పూడికతీత

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని కృష్ణరాయపురం గ్రామంలో శుక్రవారం అన్ని వీదుల్లోని కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత, చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని సర్పంచ్ గుణుపూరు అన్నం నాయుడు,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తూ నిర్వహించారు.గ్రామంలోని అన్ని వీదులలో కాలువలను పరిశుభ్రత చేయడం జరుగుతుందన్నారు. తీసివేసిన మురుగును, పూడికను, చెత్తా చెదారాన్ని ఎండినతరువాత ఒకటి రెండు రోజుల్లో దూరముగా ట్రాక్టర్ ద్వారా తరలించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగిందన్నారు. ఎమ్మెల్యే జోగారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మంజూరు చేసిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు (బూర్జ- అజ్జాడ ప్రధానరహదారి నుండి గ్రామానికి విచ్చేసే రోడ్డు) ఆయన చేతుల మీదుగా త్వరలోనే శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు టిడిపి నియోజకర్గ శిక్షణ

విశాలాంధ్ర-పార్వతీపురం:స్థానిక లైన్స్ కళ్యాణమండపంలో నియోజకవర్గంలోని మూడు మండలాల బూత్ ఇంచార్జిలకు, యూనిట్ ఇంచార్జిలకు, క్లస్టర్ ఇన్చార్జులకు, పార్టీ క్రియాశీలక నేతలకు ఓటరులిస్టు వెరిఫికేషన్,హౌస్ మేపింగుపై అవగాహనా శిక్షణాకార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు నియోజక వర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు ఒకప్రకటనలో తెలిపారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు మీ భవిష్యత్తుకు గ్యారెంటీ వినాదంతో రాష్ట్రప్రజల నమ్మకాన్ని పొందుకున్న మనఅధినేత నారా చంద్రబాబునాయుడుఆదేశానుసారం జరిగే ఈకార్యక్రమంలో మాజీశాసనమండలి సభ్యులు, రాష్ట్రఅధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీశ్వరరావు హాజరు కానున్నారని చెప్పారు. అంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రూ.53 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శంకుస్థాపనలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలో వివిధ డివిజన్లలో 53 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేశారు. 6వ డివిజన్ లోని సింగపూర్ సిటీ వద్ద 40 లక్షల రూపాయలతో కాలువ నిర్మాణానికి, 17, 18 డివిజన్లో 13 లక్షల రూపాయలతో సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 53 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసామన్నారు. పనులు ప్రారంభించడమే కాకుండా అవి పూర్తి అయ్యేవిధంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 20 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా 17, 18 డివిజన్లో రహదారులు, కాలువలు నిర్మాణానికి వెచ్చిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు తెలిసిన వెంటనే వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపుతున్నామని అన్నారు. డిప్యూటీ మేయర్ లయ యాదవ్ మాట్లాడుతూ నగర అభివృద్దే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాలలో సైతం అభివృద్ధి పనులను చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఆశపు సుజాత, ఆల్తి సత్యకుమారి, మీసాల రమాదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, బోడసింగి ఈశ్వరరావు, బొద్దాన అప్పారావు, కోఆప్షన్ సభ్యులు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్ పర్సన్ లెంక వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ కాలానికి విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలు ద్వారా పంపిణీ చేయుటకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె. రాబర్ట్ పాల్ తెలిపారు. వరి విత్తనాలు - 25,000 క్వింటాళ్ళు ఉన్నాయని రైతు సోదరులు డి కృషి యాప్ లో నమోదు చేసుకొని, ధర చెల్లించి విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చున్నారు. కందులు - 320 క్వింటాళ్ళు ఉన్నాయని రైతు మిత్రులు వీటిని 100% రాయితీతో పొందవచ్చని, అలాగే వరి విత్తనాలు - 25,000 క్వింటాళ్ళు ఉన్నాయని, అందులో 8,000 క్వింటాళ్ళు 90%. రాయితీతో గిరిజన ప్రాంతాలలో చేయడం జరుగునని, రాగులు 87 క్వింటాళ్ళు 100 %. రాయితీ అందిస్తామని, వేరుశెనగ 50 క్వింటాళ్ళు 100 % రాయితీతో అందిస్తామని, ఇందులో ఎస్సీ, ఎస్టీ వారికి, ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎరువులు - 44,000 పార్వతీపురం మన్యం జిల్లా మొత్తం ఖరీఫ్ కాలానికి అవసరం ఉండగా అందులో 15,000 టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తామని, ప్రస్తుతం 3,000 టన్నులు రైతుభరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచామన్నారు. పార్వతీపురం జిల్లా మొత్తం 14 టన్నులు అందిస్తామని తెలిపారు. కౌలు రైతు సోదరుల కోసం, కౌలు రైతులకు ఇచ్చే సిసిఆర్ సి కార్డులు 55,000 పంపిణీ చేయుటకు లక్ష్యంగా ఉండగా 778 సిసిఆర్ఈ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని, భూసార పరీక్ష. 10,000 నిర్వహిస్తున్నామని, ఒకోక్క రైతు భరోసా కేంద్రానికి 33 భూసార పరీక్షలు నిర్వహణకు కార్యచరణ ప్రారంభించామని, భూసార పరీక్ష వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో రైతులకు తెలియజేస్తారని, ఆన్ లైన్ మొబైల్ యాప్ ద్వారా భూసార పరీక్ష కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతు సోదరులందరు పిఎం కిసాన్, ఈ-కెవైసి రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ నమోదు రైతు భరోసా కేంద్రాల ద్వారా జూలై 1వ తేదీ నుండి సెప్టెంబర్ నెల 30వ తేదీ వరకు మొదలుపెడతామని రైతు సోదరులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని మరి ఏ ఇతర ప్రైవేటు యాప్ ల ద్వారా ఇంటర్నెట్ కేంద్రాల వద్ద చేయకూడదని విజ్ఞప్తి చేశారు. రేషనలైజేషన్ వ్యవసాయ శాఖ కమీషనర్ స్థాయిలో జరుగుతుందని ఒక్కోక్క రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది ఎంతమంది ఉండాలనేది నిర్ణయిస్తారని తెలిపారు.

కళాశాలలవద్ద డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్సీలు ఏర్పాటు

విశాలాంధ్ర- సీతానగరం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అదేశాలు మేరకు మండలంలోని వివిధ కళాశాలల వద్ద డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్సీలను ఎస్ఐ నీలకంఠం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేశారు. జోగమ్మపేట, సీతానగరం, చినబోగిలిలలో గల వివిధ కళాశా లల వద్ద ఈఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చదువుతున్న విద్యార్థులు డ్రగ్స్ కు బానిసకాకుండా సన్మార్గంలో, సత్ప్రవర్తన కలిగి చక్కగా చదువుకోవాలని కోరారు. డ్రగ్స్ అంటేనే మరణమని, యువత దీనికీ దూరంగా ఉండాలనీ హితవు పలికారు. టోల్ ఫ్రీ నెంబర్ 14500కు ఫోన్ చేసి డ్రగ్స్ నివారణ దిశగా అడుగులు వేయాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మండలంలో బూర్జ గ్రామంవద్ద సువర్ణముఖీనదిలో అక్రమంగా ఇసుక పట్టి తరలివెళ్తున్న కృష్ణరాయపురం గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లును ఎస్బి పోలీస్ సిబ్బంది పట్టుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇకో బైకుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఇకో బైకుల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎం.డి. ఎం.ఎస్. కంపెనీ చైర్మన్ అశోక్ పంగడి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ముడిదాం రోడ్డులో ఇకో బైక్ షోరూమ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంగడి మాట్లాడుతూ పెట్రోల్ అవసరం లేకపోవడం వల్ల, పర్యావరణానికి ప్రయోజనకారిగా ఉండటం వల్ల వాహన చోదకులు ఇకో బైక్‌ల వినియోగంపట్ల మక్కువ చూపుతున్నారన్నారు. అందుబాటు ధరలలో అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఇకో బైక్ లు త్వరలో మార్కెట్లో విస్తరిస్తాయని పేర్కొ న్నారు. ప్రారంభ సందర్భంగా పలు ఆఫర్లను కూడా ఇస్తున్నామన్నారు. ఎ.డి.ఎం.ఎస్. కంపెనీ ఆధ్వర్యంలో ఈ బైకులు యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు, వ్యాపారవేత్తలకు అనుకూలంగా సుమారు 12 రకాలు మోడల్స్ లో రూపొందించి షో రూమ్ లలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు కాళ్ళ శ్రీనివాసరావు, బిలవర్, సూపర్ స్టాకిస్టు సుకేష్ గుప్త పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన వైసీపీ లక్ష్యం

గడపగడపకు మన ప్రభుత్వం లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. వీధులలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బందితో కలియతిరిగి ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ప్రజాస్పందన కూడా అడిగి తెలుసు కున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న వీధి దీపాలు ఏర్పాటు విషయమై తక్షణమే స్పందించిన ఆయన లైట్లు ఏర్పాటు చేయాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. అలాగే సిసి రహదారి సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా వైసీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు మాట్లాడుతూ నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధి ఫలాలను నేరుగా ప్రజల ఖాతాలకే అందించడంతో అవినీతి రహితంగా పాలన సాగుతోందన్నారు. స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమస్యలు లేని డివిజన్లుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కసు వెల్లగక్కుతున్నారని అన్నారు. స్థానికంగా చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో చూపి ప్రతి సోమవారం గ్రీవెన్స్ లో వినతి పత్రాలు ఇవ్వడానికి ప్రతిపక్ష నాయకులు ఆసక్తి చూపుతున్నారంటే నగరంలో చెప్పుకోదగ్గ సమస్యలు లేవని చెప్పకనే చెబుతున్నారని అన్నారు. ప్రకాశం పార్కు గోడ విషయమై, రైల్వే స్టేషన్ ప్రాంతంలో నెలకొన్న చిన్న సమస్యలను కూడా స్పందన గ్రీవెన్స్ లో అందివ్వడం తప్పా ప్రజా సమస్యలను పెద్దగా చెప్పలేకపోతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. సచివాలయ కన్వీనర్ కరణపు ముత్యాలరావు (సన్నీ) మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా ప్రజల వద్దకే పాలనను మరింత సులభతరం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. గతంలో ఏ పథకం అందాలన్నా అవినీతిమయంతో ఉండేదని, ప్రస్తుతం లంచగొండితనం అనే మాటే లేకుండా ప్రభుత్వ పథకాలన్నీ లబ్ధిదారులకు నేరుగా అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఇన్చార్జి కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ,జోనల్ ఇన్చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యా కానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-చీపురుపల్లి : పట్టణంలో గురుకుల బాలికల పాఠశాల మరియు ఫైర్ స్టేషన్ వెనుక ఉన్న రామాంజనేయ కాలని జిల్లా పరిషత్ హైస్కూల్ లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చీపురపల్లి మండల జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి.. పాల్గొన్నా రు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిరాష్ట్రంలో స్కూళ్లు తెరుచుకోనున్నా సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం జగనన్న విద్యా కానుక, ప్రభుత్వ బడులకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లకు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుక పంపిణీకి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి పదవ తరగతి వరకుచదువుతున్న 43,10,165 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ. 1,042.53 కోట్ల ఖర్చుతో ఈ కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు. విద్యా కానుక కిట్లో ప్రతి విద్యార్థికి ఉచితంగా ఇంగ్లీష్ - తెలుగులో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, 3 జతల యూనిఫామ్ క్లాత్ కుట్టు కూలితో సహా ఇస్తారన్నారు. దీంతో పాటు ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు 6-10 తరగతి పిల్లలకు ఆక్స్ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ, 1-5 తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన విద్యాకానుక కిట్ ను స్కూల్ ప్రారంభమైన తొలిరోజే అందిస్తున్నారన్నారు, అనంతరం జగన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీపురపల్లి మండల జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీటీసీలు కోరుకొండ దాలయ్య, గెరిడీ రామదాసు, వార్డు మెంబెర్ కర్లపు ఆది, సచివాలయ కన్వీనర్ ఒమ్మి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంది గోపి, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రాధిక, సుపరిండెంట్ అయ్యప్ప నాయుడు, చీపురపల్లి మండల పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ..

అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు జన భగీరథ కార్యక్రమం విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం కోమటి పల్లి గ్రామంలో ఒకటి రెండు మూడు నాలుగు కేంద్రాల్లో ఆయా కార్యకర్తలు సిబ్బందితో శుక్రవారం అంగన్వాడి కేంద్రాల్లో విద్యుతోపాటు ఆటాపాటా విద్యను జన భాగిరది కార్యక్రమాన్ని అంగనవాడి రూరల్ ప్రాజెక్టు అధికారిణి జాగానా విజయలక్ష్మీ ఆదేశాలు మేరకు ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించి అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు సూపర్వైజర్లు గ్రామంలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. మనోవికాసానికి చిన్నారులు తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకి పంపించాలని అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికమైన ఆహారం తో పాటు జన భగీరథ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చిన్నారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కరంగా ఉంటుందనిఈ కార్యక్రమానికి అంగన్వాడి కేంద్రాల తల్లి నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు యాళ్ళ ఈశ్వరమ్మ, వెలమల మంగమ్మ, వాకాడ అన్నపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సదస్సు

హాజరైన ఎమ్మెల్సీలు రఘురాజు, సురేష్ బాబు తదితరులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో గల జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో, మాజీ లోక్ సభ స్పీకర్లు సుమిత్రా మహాజన్, డా.మీరా కుమార్, మనోహర్ జోషి, శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుండి మూడు రోజులపాటు జరుగుతున్న మొట్టమొదటి జాతీయ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సదస్సుకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన సదస్సులో దేశంలోని వలు రాష్ట్రాలనుండి హాజరైన శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యుల స్వీయ పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన సదస్సులో ప్రజాసేవలో ఒత్తిడిని తట్టుకోవడం, స్థిరమైన అభివృద్ధి సాధించడానికి గల మార్గాలు, పేదవారికి ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థికాభివృద్ధికి అవసరమయ్యే సాంకేతికత, ప్రశంసించదగిన శాసన ఆచరణ మొదలగు అంశాలపై జరిగిన సమావేశం, తదనంతరం రాజకీయాల ఆధ్యాత్మికీకరణ, భారతదేశ పరివర్తన, శాసనాల ఆమోదంలో శాసనసభ్యుల ముందున్న సవాళ్ళు, వాటి అధిగమించే పద్ధతులపై జరిగిన రౌండ్ టేబుల్ చర్చలో పాల్గొన్నారు. సదస్సులో విజయనగరం జిల్లానుండి ఎమ్మెల్సీ వి.వి.వి. సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), బొబ్బిలి శాసనసభ నియోజకవర్గ సభ్యులు శంబంగి వేంకట చినప్పలనాయుడు కూడా పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను విస్తృతం చేస్తున్నాం

రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

విజయనగరం/మెరకముడిదాం : వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ట పరిచి, దానిని విస్తృతం చేయడం ద్వారా రైతులకు మేలు కల్గించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృషి చేస్తున్నారని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామంలో కొత్తగా రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని, మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఒకవైపు వ్యవసాయ మార్కెట్ కమిటీలను పటిష్టం చేస్తూనే, మరోవైపు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతు ముంగిటకే అన్ని సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. దళారుల వ్యవస్థను నిర్మూలించి, వ్యవసాయ మార్కెట్ కమిటీలను విస్తృతం చేయడం ద్వారా రైతు కష్టానికి తగి ప్రతిఫలాన్ని అందించడం ప్రభుత్వ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ఫలితంగా రైతులు ఉద్యాన సాగు బదులు ఆహార పంటలను పండిస్తున్నారని చెప్పారు. ఏ పంట పండించినా రైతుకు తగిన గిట్టుబాటు ధరను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం గ్రామ ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి,

ఆర్‌డిఓ ఎం.అప్పారావు, మార్కెటింగ్ ఎడి గంగాధర్, డిఇ కోటయ్య, తాశిల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఓ రత్నం, ఏఓ శ్రావణి తేజ, ఏఈ ఆర్.పార్వతి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్లు ఎస్‌వి రమణరాజు, కెవి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, మీసాల విశ్వేశ్వరావు తదితర నాయకులు పాల్గొన్నారు

ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డ ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మం నాయుడు మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం అలజంగి గ్రామం ఉప సర్పంచ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్నూరు లక్ష్మం నాయుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన పాఠకులకు విధేయతమే . శుక్రవారం లక్ష్మీనాయుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరంలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి మృతుడు సొంత గ్రామం అలజంగి గ్రామం తీసుకువచ్చారు. గ్రామ ప్రజలు లక్ష్మీనాయుడు మృతదేహాన్ని చూడడానికి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. మృతుడు కుటుంబానికి ఎమ్మెల్యే శంబంగి సోదరులు వేణుగోపాల నాయుడు సందర్శించి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడులు

24 మంది అరెస్టు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం చంద్రంపేట గ్రామ శివారులో కోడి పందాల శిబిరంపై ఎస్ఐ పి.నారాయణ రావు ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులల కోడి పందాలు ఆడుతున్న 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. 5 కోడి పుంజులు, రూ.32,130 నగదు, మూడు కార్లు, మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నారాయణ రావు వెల్లడించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-తెర్లాం: మండల పరి షత్ కార్యాలయంలో ఇంజనీ రింగ్ అసిస్టెంట్లతో పేదలు అందరికీ ఇళ్ళు (హౌసింగ్)పై ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ. సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మన మండల మునకు సంబంధించి 2251 ఇళ్ళు మంజూరు కాగా లబ్ధిదారుని ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశలలో వున్నాయని, వాటిలో గృహనిర్మాణాలు నిర్మించు కోడానికి అయిష్టంగా వున్న 950 లబ్ధిదారుల వివరములు కటిల్మెంట్‌కు లబ్ధిదారుడు ఇష్టపూర్వకంగా రాసిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో అంద జేయడం ఎందుకు జాప్యం జరుగుతుందని, ఇలా చేస్తే శాఖాపరమైన చర్యల ను తీసుకుంటామని అన్నారు.

ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్త తీసుకోండి

ఎంపీడీఓ సాయి కూర్మనాద్ పట్నాయక్

విశాలాంధ్ర-వేపాడ: ఉపాధి కూలీలు వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని,అలాగే క్షేత్ర సహాయకులు కూలీలకు మంచినీటి సదు పాయం, టెంట్ వంటి సదుపాయాలను కల్పిస్తూ అందుబాటులో ఉంచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి కూర్మనాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రామస్వామి పేట పాటూరు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట పాటూరు పంచాయతీ కార్యదర్శి, సంధ్య ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, హెల్త్ సిబ్బంది,సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసం తోనే విజయాలు సొంతం : డిఈఓ

విశాలాంధ్ర-కురుపాం: అందరిలో నేనే బెస్ట్ అన్న ఆత్మవిశ్వాసం ఉన్న వారుతప్పకుండా విజయాలు సాధిస్తారని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాధికారి ఎన్.. ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం కురుపాం జిల్లాపరిషత్ పాఠశాల ను ఆకస్మికంగా సందర్శించిన ప్రేమ్ కుమార్ స్కూల్ అసెంబ్లీని పరిశీలించిన అనంతరంవిద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రపంచంలో అందరికన్నా చదువు కున్న వారే గొప్పవారని అన్నారు, విద్య మనిషిని అత్యున్నత స్థానంలో నిలుపుతుందని అంటూ విద్యార్థి స్థాయిలో చదువు పట్ల ఏమాత్రం అలసత్వం చూడరాదని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు తో సమీక్ష నిర్వహించారు, ఈ ఏడాది 10వతరగతిలోఅత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయలని సూచించారు. ఉపాధ్యాయులు తో సమీక్ష చేపట్టారు. కొత్తగా ప్రైవేటు హైస్కూలు ఏర్పాటు కు ఇంకా ఎవరి కీ అనుమతి ఇవ్వలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇబ్బంది కలిగే అనుమతి ఇచ్చేది లేదని అన్నారు... ఎపి మోడల్ స్కూల్ ,మండల పరిషత్2పాఠశాల మధ్య లో ఉన్న విషయం పై స్పందించిన ఆయన అన్నారు. ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కుంభ వలసలో పులి కలకలం

విశాలాంధ్ర-మెంటాడ: ఇప్పుడిప్పుడే పులి ఆనివాళ్ళు మరచి సేద తీరుస్తున్న మండల ప్రజలకు మళ్లీ బెంగాల్ టైగర్ సంచరించినట్లు ఒకసారి గా మండల వాసులు ఉలిక్కిపడ్డారు. వివరాలు వెళ్తే మెంటాడ మండలం ఆంద్ర పంచాయతీ కుంబవలస గ్రామంలో నిర్మాసం ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఆవు వికతజీవిగా కనిపించింది స్థానికులు సమాచారం మేరకు అటవీ సిబ్బంది రంగంలో దిగి సంఘటన స్థలాన్ని పరిశీలించగా ఇవి పులి అడుగుజాడలన్నీ మెంటాడ మండలం రేంజర్ కెవి ఎన్ రాజుగారు ఒక ప్రకటన తెలియజేశారు ఆంద్ర పంచాయతీ గల కుంబవలస గ్రామానికి చెందిన సోములు కొండయ్య అనే రైతు రెండు రోజులుగా ఆవు కనిపించకపోవడంతో వెతుకులాడుగా శుక్రవారం ఉదయం నిర్మాణప్రదేశంలో చనిపోయి ఉన్నావని చూసి అడవి అధికారులకు తెలియజేయగా అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇది నిజంగా పులి అడుగుజాడలని తెలియజేశారు అక్కడ ఉన్న ప్రజలను అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడవి అధికారులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది సమంత సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెల గాడలో ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షా ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బలోపేతం చేస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో మార్కులు సాధించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్ఞాన శంకర్, ఉపాధ్యాయులు, పీసీ చైర్మన్ బాలి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీతో ఎన్నో

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎన్నో ఏళ్లనాటి కల సాకారం అవ్వడంతో అయ్య కోనేరు దక్షిణ గట్టు ప్రాంతవాసుల్లో ఆనందోత్సాహం పెల్లుబికింది. 60 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయడంతో హర్షాతిరేకాలు మిన్నంటాయి. శుక్రవారం సాయంత్రం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొని ఇళ్ల పట్టాలను అందజేశారు. చాలా ఏళ్లుగా ఇళ్ల పట్టాలు లేకపోవడంతో బితుకు బితుకుమంటూ జీవనం గడిపిన వారి జీవితాల్లో వెలుగు రేఖలను నింపారు. దక్షిణ గట్టు ప్రాంతంలో 40 మందికి, లంక వీధి ప్రాంతంలో 12 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో ఆ కుటుంబాల్లో ఆనందం వెల్లి వెలిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ చాలా ఏళ్ళుగా దక్షిణ గట్టు ప్రాంతంలో నివాసముంటూ పట్టాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయని అన్నారు. పెద్ద చెరువు సుందరీ కరణ లో భాగంగా తాము పర్యటించినప్పుడు ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను గమనించి పట్టాల మంజూరుకు హామీ ఇచ్చానన్నారు. అనుకున్న విధంగానే ఎక్కడా అవినీతి లేకుండా ఇళ్లపట్టాలను మంజూరు చేసిన ఘనత తమదేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిది పేద బడుగు బలహీన వర్గాలు ఆనందంగా జీవించాలన్నదే ప్రధాన ధ్యేయమని, అందుకు తగ్గట్లుగానే నియోజకవర్గ పరిధిలో తాము కృషి చేస్తున్నామని అన్నారు. అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాము చేస్తున్న నిస్వార్థ పూర్వక సేవలను గమనించిన అధికారులు కూడా అందుకు తగ్గట్లుగానే కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో సుంకర వీధిలోని గోశాలలో అనేకమందికి ఇలపట్టాలని మంజూరు చేసామని గుర్తు చేశారు. అలాగే ముచ్చువాని చెరువు, నాగోజీపేట ప్రాంతవాసులకు కూడా ఇళ్ల పట్టాలు అందజేసిన విషయాన్ని గమనించాలన్నారు. అయోధ్య మైదానం ప్రాంతంలో ఉన్న ఉప్పరపేటలో ఇల్లు అగ్నికి ఆహుతి అయిన తర్వాత పొజిషన్ సర్టిఫికెట్లను ఇచ్చినట్లు చెప్పారు. నగరంలో భయం లేకుండా ప్రజలందరూ నివసించడానికి అవసరమైన పట్టాలను అందజేసి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్న సదుద్దేశంతోనే తాము కృషి చేస్తున్నామని చెప్పారు. అందరి ప్రజా ప్రతినిధులు సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఎక్కడ ఎటువంటి అవినీతి లంచగొండితనం లేకుండా నేరుగా పథకాలన్నీ లబ్ధిదారులకే చెందే విధంగా చూస్తున్నామన్నారు. ఎటువంటి అవసరం ఉన్న తమ వద్దకు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చని, ఒక కుటుంబంల్లా రానున్న రోజుల్లో అందరూ కలిసి ప్రయాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరోనా సమయంలో ప్రజల ఇబ్బందులను గమనించి నాయకులుగా బరోసా కల్పించే విధంగా ప్రయత్నించామని గుర్తు చేశారు. అన్ని విధాలా ధైర్యాన్ని కల్పించామని అన్నారు. అందుకున్న పట్టాలతో లబ్ధిదారులందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గతంలో జీవనం సాగించిన దక్షిణ గట్టు ప్రాంతంలో ప్రాంత వాసులకు ఇకపై ధైర్యంగా ఉండవచ్చునని అన్నారు. సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి కమిషనర్ ప్రసాద్ రావు, తాసిల్దారు కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జోనల్ ఇన్చార్జిలు కోలగట్ల కృష్ణారావు, సంఘం రెడ్డి బంగారు నాయుడు, వైసీపీ నాయకులు డోల మన్మధకుమార్, వివిధ ట్రస్ట్ బోర్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కొత్తమానిఫెస్టో గూర్చి యువతకు వివరించిన వాడాడ

విశాలాంధ్ర-బలిజిపేట: మండలంలోని పెద్దింపేట గ్రామ పంచాయతీ గౌరీపురం లో యువతకు మండల టీడీపీ నాయకుడు వాడాడ రాము టీడీపీ నూతన మ్యానిఫెస్టో గురించి అవగాహన కల్పించారు. బాబును గెలిపిస్తే యువతకి నిరుద్యోగ భృతి మూడువేలు, ప్రతీఒక్కరికి ఉద్యోగ కల్పన, మహిళలభద్రతభవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మండలటీడీపీ ప్రెసిడెంట్ పెంకి వేణు గోపాల్ చేతుల మీదుగా యువతకి వాలీబాల్ కిట్లును అందజేశారు. కార్యక్రమంలో పెంకి రామోహనరావు, పెద్దింటి జగన్మోహనరావు, మండల ప్రకాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మాగాణి ఎక్కువ ఉన్నరైతుల పరిస్థితి ఏంటి?

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో చీకటి పేట గ్రామ సచివాలయం పరిధి లో ఉన్న అరసబలగ గ్రామ సర్పంచ్ తో పాటు పలువురు రైతులు వరి విత్తనాలు పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం విలేకర్లు తో మాట్లాడుతూ రైతుకి కరీష్, వరి విత్తనాలు కు ఇబ్బందులు తలెత్తు తున్నాయి అని చేకటిపేట సచివాలయం అగ్రికల్చర్ సిబ్బంది భార్గవి రైతులకు వరి విత్తనాలు ఒక్క పాసుబుక్కు లో 50 ఎకరాలు ఉన్న రైతుకు ఒక్క ఎకరం ఉన్న విత్తనాలు బ్యాగ్ ఒక్కటే ఇస్తామని, పదకుండు వందల పదకుండు రకం విత్తనాలు ఒక్క బ్యాగే ఇవ్వమన్నరు అని, ముందు డబ్బులు కడితే 2,3 రోజులు తరువాత రైతులకు విత్తనాలు అందజేస్తాం అంటున్నారని, మాగాణి ఎక్కువ ఉన్న రైతుల పరిస్థితి ఏమిటి అని అరసబలగా గ్రామ సర్పంచ్ సాయిరాం తో పాటు పలువురు రైతులు వాపోయారు.వెయ్యి ఒకటి రకం విత్తనాలు అయితే తెప్పిస్తాం బ్లాక్‌లో కొనుక్కోండి అని ఎగ్రికల్చర్ సిబ్బంది చెప్తున్నారని రైతులు తెలిపారు. ఈ విష్యం పై ఎగ్రీకల్చర్ సిబ్బంది భార్గవి నీ వివరాలు కోరగా ఎంత భూమి ఉన్న ఒక్క బ్యాగ్ ఇవ్వమని పై నుంచి మాకు ఆదేశాలు ఉన్నాయని మేము ఎం చెయ్యగలం అని అన్నారు.బ్యాగ్ కు ముందు డబ్బులు కడితే నే విత్తనాలు పంపిస్తామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రాధాన్యత

జేఏసీ కన్వీనర్ గిరి రఘు

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఎక్కువగా ఇస్తున్నారని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేఏసీ కన్వీనర్ గిరి రఘు పేర్కొన్నారు. శుక్రవారం సాలూరు పట్టణంలో 22వ వార్డు తెలగ వీధి స్కూల్లో "జగనన్న విద్యా కానుక" ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ రఘు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్య, వైద్యంలో ముందడుగు ఉండాలని ఒక దృఢమైన సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ,విద్యార్థులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి చదువును అందించాలని వారిని ముందుకు తీసుకొచ్చే బాధ్యత మీకు ఉందని తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని ఆనందపురం వద్ద చంపావతి నది లో అక్రమ ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను. ఎస్సై హరిబాబు నాయుడు శుక్రవారం పెట్టుకున్నారు. గరికవలస, కోటగండ్రేడు, ఆనందపురంలో ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా. తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి అన్నారు. ఫిర్యాదులు భాగంగా అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదు

జనసేన నాయకులు గురాన అయ్యులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: వైకాపా మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ యోగ్యత మరచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యులు హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను పవన్ కళ్యాణ్ లేవనెత్తితే వైకాపా ప్రజాప్రతినిధులు మితిమీరి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా బందర్ నాని సంస్కారం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత నానికి లేదన్నారు. రాజకీయాలకు రాక ముందు నుంచే పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం ఏర్పరుచుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ తన విలువైన సమయాన్ని, ధనాన్ని ఖర్చు చేస్తూ, కులాలకు, మతాలకు అతీతంగా నిస్వార్థమైన రాజకీయం చేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై కాపు నాయకులతో విమర్శలు చేయించడం సిగ్గుచేటన్నారు. కాపులంతా వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన వైకాపా ప్రజాప్రతినిధులు ప్రజలకు పాలేరుగా పనిచేయాలని, అలా కాకుండా అవినీతిపరుడ్కైన జగన్మోహన్‌రెడ్డికి ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో సినిమాల్లో డ్యాన్సులు చేస్తూ, రంగులు వేసుకున్న నందమూరి తారక రామారావు రాజకీయాల్లోకి వచ్చి ప్రభంజనం సృష్టించి, పాలనలో మార్పులు తీసుకువచ్చిన సంగతి బొత్స గుర్తుంచుకోవాలన్నారు. అవినీతిపరుడు, దుర్మార్గుడ్కైన జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల దురదృష్టమన్నారు. ఇప్పటికైనా వైకాపా ప్రజాప్రతినిధులు నోరు అదుపులో పెట్టుకు మాట్లాడాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

సంగాం లోకాలనీ ఇళ్లకు భూమి పూజ

విశాలాంధ్ర-వంగర : మండలంలో సంగాం గ్రామంలో కొత్త కాలనీ ఇళ్లకు భూమి పూజ చేశారు. 60 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వంకాలనీ ఇల్లు నిర్మాణానికి లబ్ధిదారులకు ఇల్ల స్థలాలు కేటాయించారు. స్థలాలు, ఇల్లు సమకూర్చడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమయ్యారు. పనులు ప్రారంబించారు. ఈ కాలనీ ఇళ్లకు సంబంధించి అక్కడ మంచినీటి బోరు ఏర్పాటు చేయనున్నట్లు హౌసింగ్ అస్సి టెంట్ ఇంజినీర్ గౌర్జ పైడితల్లి తెలిపారు. ఇల్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన అన్ని గ్రామాల్లో గల లబ్ధిదారుల ను కోరారు. మండలంలో అన్ని గ్రామాలను సందర్శించి కాలనీ లబ్ది దారులను కోరినట్లు చెప్పారు.

ఉపాధి పథకం ద్వారా ఉద్యానవన మొక్కలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉపాధి హామీ పథకం క్రింద ఉద్యానవవ మొక్కలు అధిక సంఖ్యలో నాటుటకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో గృహనిర్మాణం, రీసర్వే, ప్రాధాన్యతా పనులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశితలక్ష్యం పూర్తి చేయడమే కాకుండా 10 వేలఎకరాల వరకు వేయాలని చర్యలు చేపడుతున్నామన్నారు. గృహ నిర్మాణం, ప్రాధాన్యత పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రమేష్, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, ప్రణాళిక అధికారి పి. వీరరాజు పాల్గొన్నారు.